క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల అందజేత



ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించి మంచి స్థితిలో స్థిరపడాలని ఎంఈవో టి.రామ్మూర్తి అన్నారు. ఆదివారం బండివారిగూడెం ఎంపీయూపీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. గ్రామానికి చెందిన దాత నాళం భరత్‌కుమార్ తన పూర్వీకుల జ్ఞాపకార్థం ఒక్కొక్క విద్యార్థికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా దాతను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.బాజా, నాళం నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల టీం విజయం

ద్వారకాతిరుమల: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలను భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించినట్టు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.దేవానందరావు తెలిపారు. భీమడోలు డివిజన్ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ద్వారకాతిరుమల, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాలకు చెందిన టీంలు పాల్గొన్నాయని, అందులో ద్వారకాతిరుమల టీం 5 వికెట్ల తేడాతో గెలుపొందినట్టు చెప్పారు. త్వరలో జిల్లా స్థాయిలో జరగనున్న పోటీల్లో ద్వారకాతిరుమల టీం ఆడనున్నట్టు తెలిపారు.

రామ్‌కు సత్కారం



నిరలాక్షరామ్‌ని సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: దాసరోజు నిరలాక్షరామ్ కొయ్యలగూడెం మండలానికి, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘానికి గర్వకారణంగా నిలిచాడని ఆ సంఘం అభినందించింది. ఆదివారం గవరవరంలోని వెంకయ్యపాలెం రోడ్డులో ఉన్న శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో రామ్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల చిరుప్రాయంలోనే భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, ఇతిహాసాలు, పురాణాలు, జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన అంశాలు అనర్గళంగా ఉపన్యసిస్తూ ఆరు ప్రపంచ బుక్స్ రికార్డ్స్‌లలో రామ్ స్థానం సంపాదించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి రామ్‌ను పూలమాలలతో అభినందించి సంఘ పెద్దలు ఆశీర్వదించారు.

నేత్ర పర్వం.. పవిత్రాధివాసం



యాగశాలలో పవిత్రాధివాసం అనంతరం హోమ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ యాగశాలలో అర్చకులు పవిత్రాధివాసాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలను అర్చకులు, రుత్వికులు వేడుకగా జరిపారు. అనంతరం పవిత్రాలకు పంచగవ్య ప్రోక్షణ, అభిమంత్రణలను నిర్వహించారు. ఆ తరువాత శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల వద్ద పవిత్రాలను ఉంచి పంచ శయనాదివాసాన్ని వేద మంత్రోచ్ఛరణతో అర్చక స్వాములు నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ కల్పవృక్ష వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. రామానుజపురం సర్పంచ్ అడపా నాగలక్ష్మి రాంబాబు దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమానికి రూ.6 వేలు విరాళంగా అందజేశారు. ఆశ్రమంలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని వీఆర్‌వో అసోసియేషన్ హామీ ఇచ్చింది. నిర్వాహకులు మాజేటి అప్పలరాజు, క్లబ్ సభ్యులు దారం సత్తిరాజు, బోనగిరి పాపారావు, యాతం సత్యనారాయణ పాల్గొన్నారు.

135 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఏలూరు విజన్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 135 మందికి పరీక్షలు నిర్వహించగా 12 మందికి శస్త్రచికిత్సలు చేయడానికి వేమగిరిలోని ఆసుపత్రికి తరలించారు. మరో 26 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు అందజేశారు.

జీవనానికి 'బొమ్మ' గణపతులు






మట్టి వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమైన నాగేశ్వరరావు, అతని మనుమడు గౌతమ్



తుది మెరుగులు దిద్దుకున్న గణేష్ విగ్రహాలు



విక్రయానికి సిద్ధంగా గణేష్ భారీ మట్టి విగ్రహం

- వినాయక చవితికి సిద్ధమవుతున్న గణేష్ విగ్రహాలు
- రాత్రింబవళ్లూ శ్రమించి తయారు చేస్తున్న కుటుంబాలు
- అవే వారికి జీవనాధారం
- మట్టి విగ్రహాలకు తగ్గిన డిమాండ్

ద్వారకాతిరుమల: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో జైజై గణేశా అంటూ దూందాం చేసేందుకు కుర్రకారు సిద్ధమవుతుంటే.. బొజ్జ గణపయ్య విగ్రహాల తయారీలో కళాకారులు బిజీగా ఉన్నారు. పండుగకు మరో 20 రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లాలో గణేష్ విగ్రహాల తయారీ ఊపందుకుంది. వీటి తయారీ, విక్రయాలపై ఎన్నో కుటుంబాలు జీవనోపాధిని పొందుతున్నాయి. ప్రస్తుతం ఆ కుటుంబాలన్నీ విగ్రహాల తయారీలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి. ఇప్పటికే గణేష్ విగ్రహాలు దాదాపు ముస్తాబు కాగా, భారీ విగ్రహాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఈ క్రమంలో కొందరు కళాకారులు పర్యావరణ పరిరక్షణకై మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే తయారు చేస్తున్నారు. ఇలా మట్టి విగ్రహాల తయారీలో ఓ కుటుంబం నిమగ్నమైంది. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి శివారులోని జాతీయ రహదారి పక్కన, భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామానికి చెందిన పేరవరపు నాగేశ్వరరావు గణేష్ మట్టి విగ్రహాల తయారీని కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు. వీటి తయారీలో నాగేశ్వరరావుకు తన భార్య అన్నపూర్ణ, రెండవ కుమార్తె లంకా భారతి, పెద్ద అల్లుడు నాగరాజు, మనుమడు గౌతమ్ సహకరిస్తున్నారు. మూడు నెలల క్రితం ఈ విగ్రహ తయారీ పనులను ప్రారంభించారు. ప్రత్యేక ఆర్డర్లతో పాటు, అదనంగా మరికొన్ని విగ్రహాలను తయారు చేస్తున్నారు. పండుగ ముందురోజు సైతం విగ్రహాలను విక్రయిస్తామని నాగేశ్వరరావు చెబుతున్నారు.

ఆకర్షణీయ విగ్రహాలకు డిమాండ్

ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో ఆకర్షణీయంగా తయారైన విగ్రహాలను కొనుగోలు చేసేందుకే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దాంతో మట్టి విగ్రహాలకు డిమాండ్ తగ్గింది. అయితే పర్యావరణ ప్రేమికులు మట్టి విగ్రహాలనే కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఆర్డర్లపై నాగేశ్వరరావు వద్ద విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు.

సైజును బట్టి ధర..

ప్రస్తుతం 5 అడుగుల ఎత్తు మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు. అంతకు మించి ఎత్తు కావాలంటే ముందుగా ఆర్డర్ ఇవ్వాల్సిందేనని అంటున్నారు. విగ్రహం సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఐదు అడుగుల విగ్రహం ధర రూ. 8 వేల నుంచి, రూ. 10 వేలకు పైగా పలుకుతోంది.

చేదోడు వాదోడుగా..



వంశపారంపర్యంగా ఈ విగ్రహాలను తయారు చేస్తున్నాం. నా తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులమంతా చేదోడు వాదోడుగా నిలుస్తూ విగ్రహాలకు జీవం పోస్తున్నాం. రాత్రింబవళ్లు శ్రమిస్తేనే అనుకున్న సమయానికి విగ్రహాలను అందించగలం. పర్యావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాలనే ప్రతి ఒక్కరూ వినియోగించాలి.

లంకా భారతి, నాగేశ్వరరావు కుమార్తె

ఆర్డర్లు తగ్గాయి..



మట్టి విగ్రహాల తయారీ చాలా కష్టంతో కూడుకున్న పని. ఇవి పర్యావరణానికి మేలు చేస్తాయి. అందుకే చాలా మంది మా వద్ద విగ్రహాలు కొంటున్నారు. గత ఏడాది ఆర్డర్‌పై 30కి పైగా విగ్రహాలను అమ్మాను. అలాంటిది ఈసారి 15 విగ్రహాలకు మాత్రమే ఆర్డర్లు వచ్చాయి. పండుగ దగ్గర్లో ఎవరైనా కొంటారన్న ఆశతో ఎక్కువ విగ్రహాలను తయారు చేస్తున్నాము. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలపై మక్కువ పెరగడమే ఆర్డర్లు తగ్గడానికి కారణం. నానాటికి మా జీవనోపాధి దెబ్బతింటోంది.

పేరవరపు నాగేశ్వరరావు, విగ్రహాల తయారీదారుడు

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు ఎంపీ వినతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలైన బైనేరు వాగు బ్రిడ్జి, డంపింగ్ యార్డు సమస్యపై చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్ కె.వెట్రి సెల్విని ఆయన ఒక లేఖ రాశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటైన బైనేరు శివాలయం పక్కనే డంపింగ్ యార్డు ఉండటం వల్ల, యార్డు నుంచి వచ్చే దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డు మార్పుచేసి వేరొక చోట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బైనేరు శివాలయం వద్ద ఉన్న బ్రిడ్జి 2018లో వచ్చిన వరదలకు కూలిపోయిందన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి కొవ్వూరు రోడ్డు వైపు రాష్ట్ర జాతీయ ప్రధాన రహదారిని అనుసంధానం చేసే మార్గంలో ఉన్న ఈ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలన్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన ఆ లేఖలో కోరారు.

పాపన్నగౌడ్ ఆశయాలు కొనసాగిస్తాం



కుక్కునూరు: గౌడ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కొన్నె లక్ష్మయ్య



కొయ్యలగూడెం: గణేష్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

కుక్కునూరు: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని కుక్కునూరు మండల గౌడ్ సంఘ నాయకులు కొన్నె లక్ష్మయ్య అన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మండలంలోని పెద్దరావిగూడెంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు పాపన్నగౌడ్ అన్నారు. పాపన్న వీరత్వానికి గుర్తుగా లండన్ మ్యూజియంలో ఆయన విగ్రహాన్ని పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెల భిక్షం, గడ్డం సత్యనారాయణ, పుల్లారావు, మోహన్‌రావు, మణికంత, సామాజిక కార్యకర్త మైసాక్షి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

జనగామకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలి

కొయ్యలగూడెం: తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి అని మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు ఆదివారం పేర్కొన్నారు. గణేష్ సెంటర్‌లో పాపన్న గౌడ్ 374వ జయంతి కార్యక్రమం జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బహుజనులను ఏకం చేసుకుని రాజ్యాధికారాన్ని పొందిన పాపన్న గౌడ్ నేటి తరానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెంలో పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు గౌడ సంఘం తీర్మానం చేసింది. సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గౌడ సంఘం నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, చిటికెన నాగార్జున, మట్టా సత్యనారాయణ, కొనకళ్ళ రాము, చిటికెన తిలక్, మట్టా వెంకటేశ్వరరావు, కట్టా రాంబాబు, తొంటా మంగారావు, ఎస్సీ సెల్ నాయకులు ఏలేటి భాస్కర్, బీసీ సెల్ నాయకులు పల్లంట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రాజీవ్‌నగర్ కాలనీవాసులు

బుట్టాయగూడెం: స్థానిక రాజీవ్ నగర్ ఎస్సీ కాలనీవాసులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కాలనీ ఏర్పడి 40 ఏళ్లు దాటినా కనీసం కమ్యూనిటీ హాల్ లేదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ అన్నారు. కమ్యూనిటీ హాల్ లేకపోవడం వల్ల శుభకార్యాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎస్సీ కాలనీలో ఉన్న 12 సెంట్ల స్థలంలో కమ్యూనిటీహాల్ మంజూరు చేయాలని కోరారు. గంజి రాజేష్, గుల్లా సరేష్, బంటుమిల్లి మంగ, మంగమూరి బేబి, ఎం.వెంకటేశ్వరరావు, పి.సూరయ్య, జి.సునీత, టి.ఇందిర, టి.మందాకిని, డి.బాలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

కొయ్యలగూడెం: గంగవరం గ్రామ మహిళ వీఆర్‌వోను వేధింపులకు గురిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వీఆర్‌వో అసోసియేషన్ జంగారెడ్డిగూడెం డివిజన్ అధ్యక్షుడు అడప రాంబాబు కోరారు. ఈనెల 17వ తేదీ రాత్రి ఎర్రకాలువ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గంగవరం గ్రామ వీఆర్‌ఓ పట్టుకుని కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌కి అప్పగించడం జరిగిందన్నారు. వీఆర్‌వో తన విధులను సమర్థవంతంగానే నిర్వహించినప్పటికీ స్థానికులు కావాలనే మహిళా వీఆర్‌వోతో అనుచితంగా వ్యవహరించడాన్ని అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా తహసీల్దారుకు ఫిర్యాదు చేసినట్లు రాంబాబు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని మారంపల్లి గ్రామ శివారులో ఒక పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో దూబచర్లకు చెందిన కొట్టు నాగేశ్వరరావు, గంటావారిగూడెంకు చెందిన రాచూరి శ్రీనులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 34,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ద్వారకాతిరుమల హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కృష్ణాపురంలో తీజ్ ఉత్సవాలు ప్రారంభం



తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఆ సంఘం నాయకులు ఘనంగా ప్రారంభించారు. తొమ్మిది రోజుల ఈ తీజ్ ఉత్సవాల్లో భాగంగా పదిమంది ఆడపిల్లలు భూక్యా హిమజ, జరభల నాగమ్మ, లావుడియా భవాని, కనక మహాలక్ష్మి, దీపిక, నాగ భవాని, తనుజ, హర్షిత దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ ఆడపిల్లలు జీవితంలో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మస్థైర్యంతో ఎదిగేందుకు బంజారాలు తీజ్ పండుగను చేస్తారని అన్నారు. అలాగే పంటలు బాగా పండాలని, పశు సంపద బాగా పెరగాలని, గ్రామం సిరి సంపదలతో వెల్లివిరియాలని కోరుతూ ప్రతీ ఏటా శ్రావణమాసంలో ఈ పండుగను నిర్వహిస్తామన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ నాయక్, తీజ్ ఉత్సవ కమిటీ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్, భూక్యా బిగనాధం, ధరావత్ రవి, జరభల పూర్ణయ్య, భద్రయ్య, బంగారు బాబు, సత్తి బాబు, భద్రమ్మ, అరుణ, భాగ్యలక్ష్మి, కృష్ణలీల తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతిభ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తూ జంగారెడ్డిగూడెంలో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ సరోజారెడ్డి మాట్లాడుతూ యావత్ భారతం సిగ్గుతో తలదించుకునే పాశవిక చర్య ఇది అని అన్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేసి ఇటువంటి దారుణాలను ప్రభుత్వాలు అరికట్టాలని కోరారు. స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి, సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఈ అన్యాయాలన్నీ సమసిపోయి ఆడపిల్లల ముఖంలో చిరునవ్వులు మతాబుల్లా వెలిగే రోజు త్వరలో రావాలని ఆకాంక్షించారు. అమ్మాయిల పట్ల సోదర భావాన్ని కలిగి ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కుక్కునూరు: వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళలకు ఇంటా బయట రక్షణ లేకుండా పోయిందని, భద్రత లేని సమాజంలో మహిళలు ఎలా తమ విధులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధర్నాకు దిగడం ప్రజల దృష్టి మరల్చేందుకేనని ఆరోపించారు. మమతా బెనర్జీ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మెట్టలో విషజ్వరాల విజృంభణ



చింతలపూడిలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు



కమ్యూనిటీ ఏరియా ఆసుపత్రిలో జ్వరాలతో రోగులు



చింతలపూడి-టి నరసాపురం ప్రధాన రహదారి పక్కన చెత్త

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత నెల రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. టైఫాయిడ్, మలేరియా, వైరల్ విషజ్వరాలతో ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో రోగుల్లో ఆందోళన ఎక్కువయ్యింది. పారిశుధ్యం లోపించిన కారణంగానే దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణాల్లో మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయకపోవడం, మండలంలోని ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉందని అంటున్నారు. గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు బయటికి పోయే దారిలేక గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చింతలపూడి నగరంచాయతీలో ఒక కమ్యూనిటీ ఆసుపత్రి, రాఘవాపురం, యర్రగుంటపల్లి గ్రామాల్లో ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నాయి. కమ్యూనిటీ ఆసుపత్రికి ప్రతి రోజూ 300 మందికి పైగా రోగులు వస్తుంటారు. ప్రస్తుతం జ్వరాలతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరిగింది. నగర పంచాయతీతో పాటు గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు లేక చెత్తను రోడ్లపై పోస్తున్నారు. వీటిల్లో పందులు చేరి అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి.

జ్వరాలపై ఇంటింటి సర్వే



వర్షాల సీజన్ కావడంతో ప్రస్తుతం జ్వరాల తీవ్రత ఎక్కువగానే ఉంది. జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపించి జ్వరాలపై సర్వే జరిపించి రక్త నమూనాలు సేకరిస్తున్నాం. అవసరమైన వైద్యం ఇంటి వద్దే అందచేస్తున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. దోమ తెరలు వాడాలి. జ్వరం, ఒళ్ళు నొప్పులు ఉంటే ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలి.

– డా.కిరణ చైతన్య, వైద్యాధికారి, రాఘవాపురం